జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 25-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 405 పేజీలు: 4 వెల : రూ.7




# ధర లేక.. జీడి రైతు డీలా



* 80కిలోల పిక్కల బస్తా రూ.12,500
* దళారీ వ్యవస్థతో రైతులు కుదేలు
* వ్యాపారులకు లాభం.. రైతుకు నష్టం
* గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

**పలాస/శ్రీకాకుళం, జూలై 24 (వార్త):** జీడిరైతులో నైరాశ్యం అలుముకుంటోంది. జీడిపప్పుకు ధర పెరుగుతున్నా.. పిక్క ధర మాత్రం తగ్గిపోతోంది. దీంతో జీడి పంట సాగు చేస్తున్న రైతుకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. సాగుకు ఖర్చు తడిసిమోపెడు అవుతున్నా పంట సమయంలో సరైన ధర పలకకపోవడం, దళారీ వ్యవస్థల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఎప్పుడు ధర పెరుగుతుందో, ఎప్పుడు తగ్గుతుందో తెలియక రైతులు జీడి పిక్కలను ఇళ్లలో ఉంచలేక, విక్రయించలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం సైతం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది 24వేల హెక్టార్లలో జీడి పంట సాగు అయింది. మే నెలలో 80కిలోల బస్తా ధర రూ.13,500 ఉండగా, ప్రస్తుతం రూ.12,500కు పడిపోయింది. రెండు నెలల్లోనే బస్తా ధర రూ.వెయ్యి పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలాసతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న జీడి పరిశ్రమలకు ప్రతి ఏడాదీ 5 లక్షల బస్తాల పిక్కలు అవసరం ఉంటుంది. అయితే, ఈ ఏడాది జీడి పంట ఆశించిన స్థాయిలో లేదు. కేవలం లక్ష బస్తాల దిగుబడి ఉంటుందని ఉద్యాన శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వ్యాపారులు ఈసారి ఇతర దేశాల నుంచి జీడిపిక్కలను దిగుమతి చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి పరిశ్రమలకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ తలరాతలు మారడం లేదని, జీడికి గిట్టుబాటు కల్పిస్తామని చెబుతున్నారే తప్ప అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారని జీడి రైతుల సంఘం ప్రతినిధులు విమర్శిస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జీడిపంటకు గిట్టుబాటు కల్పించి, ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని, దళారీ వ్యవస్థను నియంత్రించాలని, జీడి బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## తర్లాకోట శ్మశానం కబ్జా

* 29 సెంట్ల భూమికి 9 సెంట్లే మిగిలింది
* అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు
* పరిశీలించిన రెవెన్యూ అధికారులు

**పలాస, జూలై 24 (వార్త):** భూముల ధరలు ఆకాశానికి అంటడంతో.. కబ్జాదారులు ప్రభుత్వ, ప్రైవేట్ భూములు అని చూడకుండా కనిపించిందంతా ఆక్రమణకు పాల్పడుతున్నారు. ప్రజల ఉపయోగార్థం అవసరమైన భూమిని సైతం కబ్జా చేసేస్తున్నారు. పలాస మండలం తర్లాకోట గ్రామం సంస్థానాధీశులు పూర్వకాలం నుంచి 127/18 సర్వే నెంబరులో 29 సెంట్లలో శ్మశాన భూమిని వినియోగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆ భూమి కేవలం 9 సెంట్ల స్థలం మాత్రమే మిగిలింది. గతంలో ఈ భూమి వైపు ఎవరు కూడా కన్నెత్తి చూడలేదు. ఇటీవల మూడునాలుగు సంవత్సరాల్లో ఈ భూమిపై ఓ బడా బాబు కన్నుపడింది. ఆయన మరికొందరితో కలిసి ఆ భూమిని కొంచెం కొంచెంగా ఆక్రమించేస్తున్నాడు. దీంతో శ్మశానం తగ్గిపోతూ వస్తోంది. ఆక్రమించేసిన భూమి చుట్టూ ప్రహరీలు కట్టేసుకుంటున్నారు. దీంతో గ్రామస్థులు తర్లాకోట సంస్థానాధీశుల శ్మశాన భూమి ఆక్రమణకు గురికావడంతో అడ్డుకున్నారు. ఇటీవల పలాస రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. కనీసం ఉన్న భూమినైనా కాపాడడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు వివరాలు నమోదు చేసుకొని వెళ్లారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై తహశీల్దార్ ఎన్.కళ్యాణచక్రవర్తిని మీడియా ప్రతినిధులు వివరణ కోరగా గ్రామస్థుల నుంచి వినతిపత్రం అందిందన్నారు. ఆ స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

శ్మశానం పరిశీలన

తర్లాకోట సంస్థానాధీశులకు చెందిన శ్మశాన భూమిని తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. ఏ మేర ఆక్రమణ జరిగింది, ఆ స్థలాలు ఎవరి ద్వారా వారికి దాఖలుపడ్డాయో పూర్తివివరాలు సేకరించి వివరాలను అందజేయాలని వీఆర్వో, సర్వేయరుకు తహసీల్దార్ ఆదేశించారు.





## జిల్లాలో మోస్తరు వర్షం

* ఈనెల 27 వరకూ వర్షాలు
* సముద్రంలో ఎగసిపడుతున్న అలలు
* మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని జిల్లా యంత్రాంగం ఆదేశం
* అధికారులు అప్రమత్తంగా ఉండాలి
* తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్

**శ్రీకాకుళం, జూలై 24 (వార్త):** ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ స్థితిగతులపై రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన ప్రత్యేక బులెటిన్‌ను ఆయన జిల్లా అధికారులకు చేరవేస్తూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెల 27వ తేదీ వరకూ తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే సముద్రంలో గాలుల వేగం గంటకు 65 కి.మీ వరకు పెరిగే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్ళకూడదని హెచ్చరించారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం కవిటి వరకూ తీరంలో 3.0 నుంచి 3.8 మీటర్ల వరకూ అలలు ఎగసిపడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తాత్కాలిక బస కేంద్రాలు సిద్ధం చేయాలని సంబంధిత తహసీల్దార్లకు సూచించారు. ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్తు, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాతపట్నం, కొత్తూరు, ఇచ్ఛాపురం, కవిటి, నందిగాం, సంతబొమ్మాళి, గార మండలాల్లో ఎలాంటి అత్యవసర పరిస్థితికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విపత్తుల సందర్భంలో స్పందన కోసం రాష్ట్ర ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా 112, 1070, 18004250101 నెంబర్లకు లేదా seoc-apsdma@ap.gov.in మెయిల్‌కు సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగ సూచనలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విజ్ఞప్తి చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కిడ్నీ రోగికి వితరణ

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** సోంపేట బాప్టిస్ట్ చర్చిలో బిషప్ కొత్తపల్లి. అబ్రహం ఆధ్వర్యం లో దైవ సేవకులు, నాయకుల సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ప్రత్తి అన్వేష్ పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రముఖ వ్యాపారవేత్త ఇచ్ఛాపురం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ప్రత్తి విజయకుమార్ శుభాకాంక్షలు తెలిపారు, శ్రీకాకుళం ముఖ్య అతిథిగా జాషువా, బిషప్ ఇశ్రా హాజరయ్యారు. ఒక కిడ్నీ రోగికి విజయ్ కుమార్ అబ్రహాం ఆర్థిక సాయం అందజేశారు. ముఖ్య అతిధులను సన్మానించారు కార్యక్రమములో పాస్టర్ భీమ్ బెహర్, ఆనంద్, కిరణ్, శేఖర్, ఆనేక మంది దైవ సేవకులు, నాయకులు పాల్గొన్నారు.




# అబద్ధపు ప్రచారాలతో ఉద్దానానికి మోసం

**-పచ్చని ఉద్దానంలో విధ్వంసం**

**-ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్**

**మాజీ మెంబర్ బత్తిని లక్ష్మణ్**



**మందస, జులై 24(వార్త):** మందస మండలంలోని రాంపురం పంచాయతీ గంగువాడ గ్రామంలో గల భవనంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఏర్పాటు చేసిన సమావేశంలో పలాస నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే శిరీష ఓ టీవీ ఇంటర్వ్యూలో చేసిన అబద్ధపు ప్రచారాన్ని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మాజీ మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఖండించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ భూములకి పచ్చని ఉద్దానం పంట భూములకి సరిపోల్చడం అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ భూములు ఒక ఎడారి మాదిరిగా రాళ్లు రప్పలతో నిండిపోయి, కనీసం ఒక పంట కూడా పండించే అవకాశం లేనందున అక్కడ ఉన్న ప్రజలు హైదరాబాద్ సిటీకి రోజు వారీ కూలీ పనులకి వచ్చేవారన్నారు. పచ్చని ఉద్దానంలో తరతరాలుగా రైతులు పండిస్తున్న కొబ్బరి చెట్లు ఎన్ని ఉన్నాయో తెలుసా అని ప్రశ్నించారు. అదే విధంగా జీడి చెట్లు, పనస చెట్లు, మామిడి, మునగ, జామ, వేప, నిమ్మ, బొప్పాయి, నేరేడు, తాటి, ఈత, టేకు, సీతాఫలం, రాంఫలం, సపోటా, చౌకు, కూరగాయలు, వంకాయ, మిరప, ఎనుకుడి, కంది, కరివేపాకు, పూలు, వరి ఎన్ని ఎకరాలు ఉన్నాయో తెలుసా అన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఎలుగుబంట్లు, అడవి పందులు ఎన్ని ఉన్నాయో మీకు తెలుసా అని మీరు నమ్ముకున్న ఉద్దానం రైతులకు అడిగి తెలిసికుంటే మంచిదన్నారు. సారవంతమైన మన పచ్చని పంట భూమిలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన జీడిపప్పుకి నిలయం, కందమూలం దుంపలు, కర్ర దుంపలు, ఆనప, పుచ్చపాదులు, బీర, బెండ చెట్లు ఇలా కొన్ని లక్షల ఆహార చెట్లుతో ఆకలి తీర్చుతూ పచ్చదనంతో ఆక్సిజన్ ఇస్తున్న ప్రాంతం మనదన్నారు. మన చుట్టూ ఉన్న కొండలపై జాతీయ పక్షి నెమళ్లు కొన్ని వేలు ఇక్కడ జీవిస్తున్నాయని, పావురాలు, చిలుకలు, పిచ్చుకలు, తేనెటీగలు, కుందేళ్లు, నక్కలు ఇలా ఒకటేమిటి.. కొన్ని వందల రకాల అడవి జంతువులు జీవిస్తున్నాయన్నారు. పచ్చని పర్యావరణం కలిగిన ఈ నేల తల్లిని విడిచి వెళ్ళిపొండని అనే మాటలు మీ గొంతు నుంచి ఎలా వస్తున్నాయన్నారు. ఒకసారి మీకు మీరే ఆత్మ పరిశీలన చేసికోవాలని మనవి చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకి అతీతంగా బాధిత రైతులు గత 9 నెలలు నుంచి కలిసి పోరాటం చేస్తుంటే, వాళ్ళని వైఎస్సార్సీపీ నాయకులు అనే ముద్ర వేయడం చాలా అన్యాయమని, కార్గో ఎయిర్పోర్ట్ పోరాట కమిటీ పిలుపు మేరకు ప్రజా సంఘాలు, ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి, పర్యావరణ పరిరక్షణ సమితి.. మాకు పచ్చదనం పై పూర్తి అవగాహన ఉన్న వారు మద్దతు పలుకుతుంటే, వాళ్ళని పనికిమాలిన వారిగా హేళన చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమస్యని మీ స్వలాభం కోసం, రాజకీయ కోణంలో చూడకుండా ఈ ప్రాంత ప్రజలు కోసం మీరు మరోసారి పునఃపరిశీలించి కార్గో ఎయిర్ పోర్ట్ నిర్ణయాన్ని వెనక్కి తీసికోవలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో స్థానిక రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, పొట్టి ఎర్రయ్య, గుంటు రామారావు, దున్న హరికృష్ణ, దున్న రామారావు, లైసెట్టి నారాయణ, లైసెట్టి శాంతారావు, నెమలపురి సింహాచలం, నెమలపురి సోమేశ్వర రావు, రత్నాల చలపతి, తామడ పురుషోత్తం, దాసరి మోహన్, రత్నాల శంకర్ రావు, మర్ల సంతోష్, పొట్టి జోగారావు, పిచ్చుక శివ, పొట్టి యోగేశ్వర్ రావు, సియ్యారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




## డ్రగ్స్‌ని తరిమికొడదాం

**సరుబుజ్జిలి, జులై 24(వార్త):** మాదకద్రవ్యాల వినియోగం అనేది వ్యక్తిగతంగా మాత్రమే కాక సమాజానికీ చాలా పెద్ద ప్రమాదాన్ని కలిగించే సమస్య. ఇవి శరీరాన్ని మానసికాన్ని తీవ్రంగా నష్టపరిచే ప్రభావాన్ని చూపుతాయి. మత్తు పదార్థాల వినియోగం వల్ల నర్వస్ సిస్టమ్ పై భయంకరమైన ప్రభావం పడుతుంది.మత్తు పదార్థాలు తాత్కాలిక ఆనందం కలిగించవచ్చు కానీ అవి జీవితాన్ని నాశనం చేస్తాయి. దయచేసి డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.యువత మేలుకోవాలి.సరుబుజ్జిలి ఎస్ఐ బి హైమావతి తెలిపారు పోలీస్ శాఖ ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పరచి రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ సెల్స్ ను ఏర్పాటు చెయ్యడం జరిగినది గంజాయి ఎవరైనా సేవిస్తున్నా లేదా అక్రమరవాణా చేస్తున్న మీ విలువైన సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నంబర్ కి కాల్ చేసి మీ సమాచారాన్ని తెలుపగలరు.మీ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండండి



**సరుబుజ్జిలి, జులై 24(వార్త):** భారీ వర్షాలతో సరుబుజ్జిలి మండలంలోని వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహించే పరిస్థితులు ఏర్పడు తున్నాయి. రహదారులు నీటితో నిండిపోవచ్చని ముందస్తు హెచ్చరిక ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సరుబుజ్జిలి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కూటికుప్పల తారకేశ్వరావు సూచించారు. సెల్ఫీల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలతో చెలగాటం ఆడకూడదని, ఉధృత ప్రవాహం ఉన్న చోట్లకు చేరరాదని కోరారు. వాగులు, వంకల వద్దకు చేపల వేటకు జాలర్లు వెళ్లకూడదు. పశువులను కాయడానికి నదులు, వాగులు, చెరువుల దగ్గరకు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదని, సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. వర్షాల వల్ల ప్రమాదకరంగా మారే ప్రాంతాల్లో ఎలాంటి విపత్తులు జరుగకుండా మండల పోలీసులు మరియు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండి, అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు.

## నవోదయకు ఎంపికైన రామ్ సాత్విక్



**మందస, జులై 24(వార్త):** నవోదయకు ఎంపికైన రామ్ సాత్విక్ ఎంపికయ్యాడు. సోంపేట మండలంలోగల మత్స్యకార గ్రామమైన ఎర్రముక్కం గ్రామానికి చెందిన బైపల్లి రామ్ సాత్విక్ నవోదయ స్కూల్ కు ఎంపికైనట్టు తల్లిదండ్రులు తెలిపారు. ఏడాది పాటు విద్యార్థికి శిక్షణ ఇచ్చిన జగన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి తల్లి ప్రస్తుతం సిరిమామిడి పంచాయతీ సర్పంచ్ గా బైపల్లి ఈశ్వరి ఉంటూ పిల్లలు సాధించిన విజయం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. వెన్నెలవలస నవోదయకు ఎంపికావడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## వాసుదేవం కుటుంబానికి జుత్తు పరామర్శ

**మందస, జులై 24(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ మట్ట వాసుదేవం మాస్టారు ఆకస్మికంగా మరణించారు. ఎంతో ఆరోగ్యంగా ఉండే ఆయన గుండెపోటుతో మరణించినట్టు తెలుసుకున్న అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరక్టర్, జిల్లా నాయకుడు జుత్తు నీలకంఠం వాసుదేవం కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో తనకు సన్నిహిత సంబంధాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. ఉద్యోగంలో మంచి అధికారిగా, సంఘంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తిగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆరోగ్యంగానే ఉన్న వాసుదేవం మరణం లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ సందర్భంగా వాసుదేవం కుమారులు పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ మట్ట రవికృష్ణ, ఉపాధ్యాయుడు సూర్యంలను ఓదార్చారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆయనతో పాటు మట్ట వల్లయ్య, ముడిమించి దానయ్య, మట్ట మాధవరావు, గజ్జి దేశయ్య, మామిడి గణపతి తదితరులు ఉన్నారు.



# శిథిలమవుతున్న ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి



**(సరుబుజ్జిలి)**

గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సరుబుజ్జిలిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి భవనం పైకప్పు నుంచి వాటర్‌లీక్ అవడంతో భవనంలోని ఓపీ విభాగం, మందుల సరఫరా విభాగాలలో పి.ఓ.పి. సీలింగ్ ఊడి కిందపడింది. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రికి రంగులు రుద్ది, మెరుపులు మెరిపించారు. అయితే ఎంత చేసినా ఎక్కడికక్కడ పెచ్చులు వుండటంతో అటు ఆసుపత్రి సిబ్బంది ఇటు రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి రూపకల్పన చేయాలి.. లేదంటే భవిష్యత్‌లో తీవ్ర ప్రమాదం ఎదుర్కొక తప్పదు.



# ప్రజా పోరాటయోధుడు అచ్యుతానందం






**మందస, జులై 24(వార్త):** సీపీఎం నేత, మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందం సంతాపసభ మందసలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా వర్గ సభ్యుడు కె.మోహనరావు, మందస మండల నాయకుడు ఆర్.దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో నాయకుడుగా అనేక పోరాటాల్లో పాల్గొన్న వ్యక్తి వీఎస్ అని, 17సంవత్సరాల వయసులోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకొని కార్మిక వర్గం తరఫున, ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశారన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, అణగారిని వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. కేరళ అసెంబ్లీలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండు సార్లు ప్రతిపక్ష నాయకుడిగా, ముఖ్యమంత్రిగా అనేక సేవలు అందించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, సీపీఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా బాధ్యతలు చేపట్టారన్నారు. నిరాడంబర, నిస్వార్థ నాయకుడిగా సామాజిక న్యాయం కోసం నిబద్ధతో పనిచేసిన గొప్ప యోధుడు అని అన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయన అర్పించిన నిజమైన నివాళులన్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘ నాయకుడు వడ్డీ గోపాలకృష్ణ, సీఐటీయు నాయకులు, టొంప లక్ష్మీనారాయణ, ఒంటేరు గణేష్, చిన్నరావు, వెంకటి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**పలాస, జులై 24(వార్త):** సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి యస్ అచ్చుతానందన్ ఆశయాలు సాధనకై కృషి చేయడం ద్వారానే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించిన వారమవుతామని పలువురు వక్తలు అన్నారు. కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ఇ, సిపిఎం నాయకులు ఎన్ గణపతి అచ్చుతానందు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్చుతానందన్ అనారోగ్యంతో చనిపోయారని, కార్మికుడు నాయకుడుగా పార్టీలో చేరి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం సిపిఎం పార్టీలో పొలిట్ బ్యూరో సభ్యుడుగా కొనసాగుతున్నారన్నారు. ఆయన మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని ప్రసాద్, తెప్పల రాజు జుత్తు లోకనాదం, జుత్తు రాజారావు,యన్ ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, జి.భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హెచ్ఐవిపై అవగాహన

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** హెచ్ఐవి ఎయిడ్స్‌పై వైసిబి ప్రెవెన్షన్ యూనిట్ ట్రకెర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం సూర్యకుమారి కళాజాతర బృందంతో స్వర్ణభారతి డిగ్రీ కాలేజ్, స్థానిక బస్టాండులో కల్పించారు. హెచ్ఐవి ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అపోహలు తొలగిపోవాలని, వ్యాధిగ్రస్తులపై వివక్ష ఉండరాదని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణభారతి చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి, కౌన్సెలర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ సందీప్, జయప్రకాష్, ప్రాజెక్ట్ మేనేజర్ మాధవరావు, రవికుమార్, జయలక్ష్మి పాల్గొన్నారు.






## ఆరున్నర కిలోల గంజాయి తో ఇద్దరి అరెస్టు

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** స్థానిక రైల్వే స్టేషన్ వద్ద 6.600 కిలోల గంజాయి ని తరలిస్తున్న ఇద్దరు ఒడిశా కి చెందిన వ్యక్తుల ను టౌన్ ఎస్ ఐ ఎం. ముకుంద రావు అరెస్ట్ చేసినట్లు సి ఐ ఎం చిన్నం నాయుడు చెప్పారు.కోరాపుట్ కి చెందిన ప్రశాంత్ కుమార్ పాఢీ,బరంపురం నకు చెందిన కందుల పూర్ణ చంద్ర సేనాపతి లు టికా బలి లో బపుని డిఫుల్ వద్ద బెంగుళూరులో అలీ అనే వ్యక్తి కి ఇచ్చేందుకు వెళ్తుండగా అరెస్ట్ చేసి సీజ్ చేసినట్లు చెప్పారు.

## పరిశుభ్రత పై అవగాహన




**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరిశుభ్రత వల్ల వ్యాధులు దూరం అనే కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఆదేశాల మేరకు పంజా వీధిలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్ లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్ వాష్ ప్రభావం గూర్చి అవగాహన కల్పించారు. మరియు పురపాలక సంఘం పరిధిలోని చక్రపాణి వీధిలోని మురుగు కాలువలు శుభ్రం చేశారు. మరియు మెయిన్ రోడ్ లో పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ , శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాలకృష్ణాపురంలో కార్డెన్ సెర్చ్



**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసు ఆదేశాలు మేరకునేర నియంత్రణ, గంజాయి, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు గురువారం ఉదయం ఇచ్ఛాపురం రూరల్ స్టేషనుపరిధిలో ఎస్సై ఈ.శ్రీనివాసరావు అధ్వర్యంలో పోలిసు సిబ్బందితో పరిధిలో ఉన్న పలు గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, వాహన పత్రాలు తనిఖీ చేసి సరైన రికార్డులు లేని, అనధికార వాహనాలు గుర్తించి, గంజాయి,మద్యం, నాటుసారా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలు పై సోదాలు చేసి కొత్త, అనుమానిత గల వ్యక్తులు పై ఆరా తీసి నేర నియంత్రణ మరియు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్నట్లు చెప్పారు.ఈ దాడులు లో ఏ ఎస్ ఐ శంకర్ రావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## భవిష్యత్‌కు బాటలు వేసు కోవాలి

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని బరంపురం చార్టెడ్ అకౌంటెంట్ ఎం.వైష్ణవి అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల, కస్తూరిబా పాఠశాలలో స్టూడెంట్ కెరీర్ డేవేలెప్‌మెంట్ అనే కార్యక్రమం నిర్వహించారు. సంకల్ప స్కూల్ డైరెక్టర్ స్వాతి సూచనలు చేశారు. హెచ్ఎంలు శ్రీనివాసరావు, శిరీష, మోహన్ వెంకటేష్, రామకోటి, తులసీ దాస్ రెడ్డి, గోపి, రాజ్ కుమార్, షణ్ముక్ రావులు పాల్గొన్నారు.




# తూతూ మంత్రంగా అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

(సరుబుజ్జిలి)

సరుబుజ్జిలి మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది.. కారణాలేమిటని శోధించగా బూర్జ ఐ.సి.డి.ఎస్. సి.డి.పీ.ఓ. గీత గోనెపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సాధారణంగా ఆవిడ కార్యాలయం నుంచి చేతివాటం లేకుండా కాలు కొంచం కూడా కదపరు. ఆవిడ తనిఖీలు పేపర్ మీద ఉంటాయి. లోతుగా పరిశీలన చేయగా.. ఆమె ముడుపులు మహాలక్ష్మి అని, ఆవిడ గీసిన గీత దాటకుండా ఉంటే ఎంతవరకైనా సపోర్ట్ చేస్తుందని పలువురు ఆమెపై అసహనం వ్యక్తపరుస్తున్నారు. బహుశా ఇది నిజమే అన్నా ఆశ్చర్యం లేదు. అంగన్‌వాడీ అక్రమాల గూర్చి సుమారు మండలంలోని పత్రికలన్నీ ప్రచురించగా గీతమ్మ ఏదో పత్రికలో చిన్న వార్త ప్రచురించి తనిఖీలు పూర్తయినట్లు చేతులు దులుపుకున్నారు. మరో ఆసక్తికర విషయం ఏంటంటే ఆ పత్రికకు స్థానిక ప్రతినిధి లేరు అంటే అర్థమవుతుంది వార్తలో వాస్తవం ఎంత అనీ, మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా చోట్ల పిల్లలు రికార్డులో ఉంటారు కానీ కార్యాలయంలో ఉండరు. ఆ విషయాలను గీత గాలికొదిలి లక్ష్మీ కటాక్షం కోసమే పనిచేస్తున్నారు.



పత్రికా వివరణలో ఓ గొప్ప విషయం ఉంది.. 15 మంది లబ్ధిదారులతో మాట్లాడినట్లు ఆమె తెలిపారు. ఇంతకీ రికార్డులు అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన చేశారా లేదా వారి ఆవాసాలకు వెళ్లి పరిశీలన చేశారా?, మరో విషయం ఏంటంటే అందుబాటులో లేని లబ్ధిదారులను ఎలా తీసుకువచ్చారన్న విషయం ఐసీడీఎస్ అధికారులు తేల్చాలి. దీనిపై జిల్లా కలెక్టర్‌కి సంప్రదిస్తామని, కలెక్టర్ గ్రీవెన్స్‌లో పెట్టనున్నట్లు ఏ.పీ.డబ్లు.జే.ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సీపాన తవిటినాయుడు తెలిపారు.

# కామ్రేడ్ సురేఖ పాణిగ్రహి మృతి



**మందస, జులై 24(వార్త):** విప్లవకవి, శ్రీకాకుళం సాయుధ విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరిణి కామ్రేడ్ సురేఖ పాణిగ్రహి గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వగ్రామం బొడ్డపాడులో మృతి చెందారు. ఆమెకు సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ విప్లవ జోహార్ అర్పించింది. ఆమె మరణంపై సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆమె అంత్యక్రియలు బొడ్డపాడులో శుక్రవారం ఉదయం 8 గంటలకు జరుగుతాయి.

**పలాస, జులై 24(వార్త):** కామ్రేడ్ సురేఖ పాణిగ్రహి మృతిపై సిపిఐ యంయల్ లిబరేషన్ తామాడ సన్యాసి రావు, ఎబియమ్యస్ తామాడ త్రిలోచన రావు, దాసరి శ్రీరాములు,పిఒడబ్ల్యు పోతనపల్లి కుసుమ, ఎఐకేయం మద్దిల రామారావు, అమరుల కుటుంబం పోతనపల్లి అరుణ, నిరంజన్ పాణిగ్రాహి,సిపిఐ యంయల్ లిబరేషన్ నాయకులు బొడ్డు వాసుదేవు, పికేయస్, మద్దిల ధర్మారావు, సిపిఐ యం యల్ కోనేరు రమేష్,లిన్ పియావో దున్న గోవింద్, ఎబియంయస్ కోదండరావు, పిడియం సాలిన వీరాస్వామి, దీపు, మురళి సంతాపం తెలిపారు.



# అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్

**పలాస, జులై 24(వార్త):** అన్నా క్యాంటీన్లో ఆహారం రుచి, శుభ్రత రాజీ పడే ప్రసక్తి లేదని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గల "అన్న క్యాంటీన్"ను గురువారం మున్సిపల్ కమిషనర్ అకస్మాత్తుగా సందర్శించి, క్యాంటీన్ నిర్వహణ, పారిశుధ్యం, ఆహార నాణ్యతలను నిశితంగా పరిశీలించారు. లబ్ధిదారులతో క్యాంటీన్లో ఆహార నాణ్యత, రుచులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ కు ఆహారం కొరకు విచ్చేసిన పేద ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నాణ్యమైన ఆహారాన్ని, సేవా భావంతో అందించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఇక్కడ అన్న క్యాంటీన్లో అందిస్తున్న ఆహార నాణ్యతను, లభ్యతను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని, అదే రకంగా లబ్ధిదారుల ఫోన్ నెంబర్లను, ఆహార టోకెన్లను కూడా ఆన్లైన్ చేస్తున్నామని, తద్వారా ప్రభుత్వం కూడా క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి, లబ్ధిదారుల ఫీడ్బ్యాక్ ను తీసుకుంటుందని చెప్పారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మజ్జి లక్ష్మీదేవి మరణం తీరని లోటు

**మందస, జులై 24(వార్త):** ఉమ్మడి కుటుంబం పెద్దగా, శతాధిక వృద్ధురాలిగా, కళింగకుల నాయకురాలిగా మజ్జి లక్ష్మీదేవి ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని, ఆమె మరణం తీరని లోటని తెలుగుదేశం పార్టీ నాయకుడు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. మఖరజోల గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ మజ్జి పున్నయ్య, సీనియర్ న్యాయవాది మజ్జి ధర్మారావు మాతృమూర్తి లక్ష్మీదేవి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్..మజ్జి కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వల్లభరావు, ఇతర నాయకులు ఉన్నారు.



# కోటారింగి-తాళ్లభద్ర రోడ్డుకు మోక్షమెప్పుడో?

**-చినుకు పడితే చిత్తడి**

**పలాస, జులై 24(వార్త):** రహదాల అభివృద్ధి చెందితే గ్రామాల అభివృద్ధి చెందుతాయని పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు మన పలాస నియోజకవర్గంలో పలాసకి కిలోమీటర్లు దూరంలో పలాస మండలం లో నీ తర్లకోటా పంచాయితీ కోటారింగి తాళ్ళభద్ర గ్రామము వర్షం పడితే చాలు ఆ గ్రామము నుండి బయటికి వెళ్ళాలన్న, రావాలన్న గుంతలు రోడ్డు తో యుద్ధం చెయ్యాల్సిందే. ఎన్నో ఏళ్లుగా ఎందరు పాలకులు మారిన , ఆ ఊరు రోడ్డు మాత్రం మారడం లేదు.... ఆ గ్రామస్తులు వాపోతున్నారు. స్కూల్ పిల్లలు పక్క గ్రామానికి వెళ్లి చదువుకోవాలి, వర్షం పడితే చాలు పిల్లలు , పిల్లలు తల్లితండ్రులు బాధ వర్ణనాతీతం. అత్యవసర పరిస్థితుల్లో అయితే చాలా కష్టం, ఏమైనా సరుకు రవాణా, కన్స్ట్రక్షన్ మెటీరియల్ తీసుకొని వెళితే ఊరి



వరకు వెళ్ళతావి అని గ్యారెంటీ లేదు. కొన్ని సార్లు మధ్యలో అన్లోడ్ చేయాల్సిందే. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మా గ్రామానికి రోడ్డు వెయ్యవలిసిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వీరగున్నమ్మపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ



**మందస, జులై 24(వార్త):** వీరగున్నమ్మపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం మందస మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. పార్టీ నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మోసం చేసిందో వివరించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలసి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్పీపీ డొక్కరి దానయ్య, మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, జిల్లా కార్యదర్శి సూర్యారావు, సీనియర్ పార్టీ నాయకులు గిన్ని తిరుపతి రెడ్డి, చింతాడగణపతి, దుంపల వైకుంఠరావు, సిందిరి జగన్, కంచి బెహర, తలగాన హరికృష్ణ, దుప్పల శివాజీ, బాలిగాం సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**మందస, జులై 24(వార్త):** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల శాతావాహన విద్యాసంస్థల్లో జరిగిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు రక్షణా చట్టాలను తెలుసుకోవాలని కోరారు. అత్యవసర ఫోన్ నంబర్లు, ప్రభుత్వం అందిస్తున్న యాప్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వివరించారు. బెట్టింగ్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థినిలను విద్యార్థులు గౌరవించాలని, ర్యాగింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనవసర ఫోన్ కాల్లను లిఫ్ట్ చేయవద్దని, స్కాం చేయడానికి స్కామర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిపై అవగాహన, చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో శక్తిటీం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి పూజలు

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** దేవాంగుల ఆరాధ్యదైవం చౌడేశ్వరి అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ అమావాస్య సందర్భంగా స్థానిక రామలింగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు.అర్చన, కుంకుమ పూజ, హెూమం నిర్వహించారు.గణార్చన చేశారు.మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పుజ లో పాల్గొన్నారు.రామలింగేశ్వర దేవంగ సంక్షేమ సంఘం పూజా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

## ఆటో యూనియన్ కార్మికుల శ్రమదానం



**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** స్థానిక బస్ స్టాండ్ లో ఆటో యూనియన్ కార్మికులు శ్రమదానం చేశారు.బుధవారం రాత్రి రోడ్డు గోతులు కారణంగా స్కూటీ పై వెళ్తున్న ఇద్దరు మహిళలు బోల్తా పడి గాయాలయ్యాయి .108 కి ఫోన్ చేసిన స్పందించలేదు అని ఆటో యూనియన్ నాయకులు ఉలాసి ఎర్రయ్య రెడ్డి చెప్పారు. ఆటో లో బరంపురం ఆసుపత్రికి తరలిసించి నట్లు చెప్పారు. దీంతో రోడ్డు పై ఉన్న సుమారు 15 గోతులు ను శ్రమదానం చేసి పూడ్చారు. మిగిలిన గోతులు కూడా పూడ్చాలని కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

**కొత్తూరు, జులై 24(వార్త):** కొత్తూరులో గురువారం కొత్తూరు, హిరమండలాల ఆర్ఎస్కే ఇన్చార్జిలు, వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణను ప్రకృతి వ్యవసాయ శాఖ అడిషనల్ డీపీఎం ధనుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయ్కుమార్ ఆన్లైన్ క్లాస్ ద్వారా "9 బౌండరీస్", మొక్కల జీవ వైవిధ్యత గురించి వివరించారు. అనంతరం ధనుంజయరావు ప్రకృతి వ్యవసాయ తత్వం, దాని అవసరం, భవిష్యత్లో అవసరమయ్యే పాత్ర గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎం, ఎన్ఎఫ్ వివరాలు, నవధాన్యాల సాగు పద్ధతులు, కషాయాల తయారీ, వినియోగం, గ్రేడ్ ప్రమాణాలను వివరించారు. కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, డీఎంఎంటీలు వెంకటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546